క్లుప్తంగా...

ఆర్టీసీ లక్కీడ్రాను వినియోగించుకోవాలి

మేడ్చల్: రాఖీ పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళా ప్రయాణికులు సంస్థ ఏర్పాటు చేసిన లక్కీడ్రాను వినియోగించుకోవాలని మేనేజర్ సుధాకర్ మహిళా ప్రయాణికులను కోరారు. రాఖీ పండగ రోజు బస్సులో ప్రయాణించే మహిళలు ప్రయాణం సమయంలో కొనుగోలు చేసిన టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్ రాసి లక్కీడ్రా బాక్సులో వేయాలని కోరారు. లక్కీడ్రా బాక్సును అన్ని డిపోలతో పాటు మేడ్చల్ డిపోలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజేతలకు విలువైన బహుమతులను సంస్థ అందజేస్తుందని తెలిపారు.

పుస్తె మెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ దంపతులు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో పేదింట్లో యువతి వివాహానికి మాజీ ఎంపీపీ దంపతులు పద్మజగన్‌రెడ్డి పుస్తె మెట్టెలు అందజేశారు. గ్రామానికి చెందిన రాజేష్, లతల కుమార్తె దియాన్షిత వివాహం నిశ్చయం కావడంతో వారికి పుస్తె మెట్టెలు, నూతన బట్టలు అందజేసి ఆశీర్వదించారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రగతి చక్రం పురస్కారాలు



కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

మేడ్చల్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు సంస్థ అందించే ప్రగతి చక్రం పురస్కారాలను మేడ్చల్ డిపోలో బుధవారం కార్మికులకు అందజేశారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత కార్మికులను సన్మానించి వారికి పురస్కారాలను అందజేసి అభినందించారు. డీఎం సుధాకర్, అసిస్టెంట్ డీఎం రామారావు పాల్గొన్నారు.

17వ వార్డులో వినికిడి యంత్రాల పంపిణీ



మేడ్చల్: ఉచిత వైద్య శిబిరంలో గుర్తించిన వినికిడి సమస్యలున్న వారికి డాక్టర్ దీన్‌దయాల్ ఈఎన్‌టీ కేర్ సెంటర్ వారు 17వ వార్డులో వినికిడి యంత్రాలను అందజేశారు. సెంటర్ వారు వార్డులో 4 రోజుల క్రితం ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా వినికిడి సమస్య ఉన్న వారిని గుర్తించారు. బుధవారం ఐదుగురికి రూ.10వేల విలువ చేసే యంత్రాలను కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ అందజేశారు.

యాద్గార్‌పల్లిలోని ఈద్గా వద్ద బోరు



బోరు వేయిస్తున్న రమేష్‌గుప్తా, వెంకట్‌రెడ్డి

కీసర: యాద్గార్‌పల్లిలోని ముస్లింల ఈద్గా వద్ద నీటి సౌకర్యం నిమిత్తం బుధవారం కీసర దాయరకు చెందిన కాంసాని వెంకట్‌రెడ్డి, కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా బోరు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన ముస్లింలు తమ ఈద్గా వద్ద నీటి సౌకర్యం నిమిత్తం బోరు వేయించాలని కోరడంతో తాము స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచితంగా బోరు వేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో వీధిలైట్ల లొల్లి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో వెలగని వీధి దీపాలు రెండు పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. లైట్లు వెలగడం లేదంటూ బీజేపీ నాయకులు విమర్శలు మొదలుపెట్టగా.. విహార యాత్రలో ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కౌంటర్ విమర్శలు వేయడంతో చివరకు రెండు పార్టీల నాయకుల మధ్య వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సహా బీఆర్‌ఎస్ పాలకవర్గ సభ్యులు విహారయాత్రకు సింగపూర్‌కు వెళ్లారు. ఎందుకో తెలియదు గానీ వాట్సాప్ వేదికగా మంగళవారం రాత్రి మొదలైన పంచాయితీ కొనసాగుతూనే ఉంది. అభివృద్ధిపై ప్రారంభమై.. వ్యక్తిగత విమర్శల వరకు దారితీశాయి.

మింగేయాలని చూస్తున్న అక్రమార్కులు

- కుంటలో బండరాళ్లు వేసి కబ్జాకు యత్నం
- పక్కనే పీఎస్, ఎదురుగా తహసీల్దార్ ఆఫీస్
- అయినా పట్టించుకునే వారు కరువు..
- ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- కుంటను కాపాడాలంటున్న స్థానికులు



చిట్టేరుకుంటలో నింపిన బండరాళ్లు

చిట్టేరుకుంటకు.. కబ్జాల గండం..

ఘట్‌కేసర్: జలవనరులకు పెద్దపీట వేస్తున్నామన్న తెలంగాణ ప్రభుత్వం ప్రకటనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దీంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలను వదలడం లేదు. అక్కడెక్కడో మారుమూల గ్రామంలోని చెరువు కాదు, పోలీస్ స్టేషన్‌కు పక్కన, తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా, ఘట్‌కేసర్ పట్టణానికి ఆనుకుని కూతవేటు దూరంలోనే ఉంది చిట్టేరుకుంట. గతంలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కుంట అక్రమార్కుల కారణంగా రోజురోజుకూ కుంచించుకుపోతోంది. అధికారుల కళ్లు గప్పి రాత్రి సమయంలో పెద్ద పెద్ద బండరాళ్లు తెచ్చి నింపేశారు. చెరువు సరిహద్దు నుంచి రోడ్డు నిర్మిస్తే ఆవల ఉన్న ప్రైవేటు భూమిని అభివృద్ధి చేసుకోవాలని పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

పక్కా ప్రణాళికతోనే..

చిట్టేరుకుంట పక్కనే ఉన్న భూమిని అభివృద్ధి చేసుకునేందుకు మెయిన్ రోడ్డు నుంచి కుంట సరిహద్దుతో రోడ్డు నిర్మించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని పన్నాగం పన్నినట్లు సమాచారం. వచ్చిన ఆలోచనను అమలు చేయడానికి అడ్డుగా ఉన్న కుంటను కబ్జా చేసి రోడ్డు నిర్మించుకోవాలని రాత్రి రాత్రికే బండరాళ్లతో నింపేశారు. రెండేళ్ల క్రితం భారీ వరదలకు తెగిన కల్వర్టును తిరిగి నిర్మించే సమయంలో కుంటలో నీరు నిల్వకుండా లోతులో పైపులు నిర్మించాలని ఓ అధికార పార్టీ నాయకుడు అధికారులను ఆదేశించారు. చెరువు సరిహద్దులో నిర్మించిన సమాధులు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు అధికార పార్టీ అధినాయకుడితో చెప్పుకోగా చెరువులో చుక్క నీరు ఉండకుండా పైపులు నిర్మించాలని అధికార యంత్రాంగంపై ఆయన ఒత్తిడి తెచ్చాడు.

“ మొత్తం బండరాళ్లను తొలగిస్తాం..



చెరువులు, కుంటలను కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకుంటాం. చిట్టేరుకుంటలో కబ్జా చేయడానికి నింపిన బండరాళ్లను మొత్తం తొలగిస్తాం. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

\- కృష్ణ, తహసీల్దార్, ఘట్‌కేసర్ మండలం

పీఎస్‌లో ఫిర్యాదు చేశాం..



చెరువులో బండరాళ్లను నింపగానే రెవెన్యూ అధికారులతో కలిసి చెరువును సందర్శించాం. బండరాళ్లను నింపిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌లో ఫిర్యాదు చేశాం. ఎంతటి వారైనా ఊరుకునేది లేదు. తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

\- పరమేశ్, ఇరిగేషన్ ఏఈ, ఘట్‌కేసర్ మండలం ”

బఫర్‌లో సీసీ నిర్మాణం..



చెరువులు, కుంటలకు దూరంగా బఫర్‌లో 33 ఫీట్ల వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దన్న నిబంధనలను కాలదన్నారు. దహన వాటికకు వెళ్లేందుకు చెరువు సరిహద్దు నుంచి నిర్మించిన రోడ్డు ఎఫ్‌టీఎల్‌లోనే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కానీ వాస్తవం వేరే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శ్మశానవాటిక పక్కను ఆనుకొని ఉన్న భూమిలో వెంచర్ కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. మండల విద్యాధికారి కార్యాలయం పక్క నుంచి నిర్మించిన రోడ్డును వెంచర్ రోడ్డుగా చూయించి లక్షలు గడించాలని కొందరు నాయకులు, రియల్టర్లతో చేతులు కలిపినట్లు తెలుస్తోంది. అదే అదనుగా రాత్రికి రాత్రే బండరాళ్లతో చెరువును పూడ్చేందుకు యత్నించారు. గమనించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కానీ చెరువులో పూడ్చిన బండ రాళ్లు అలాగే ఉండిపోయాయి. వాటిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. చెరువును పూడిస్తే ఊరుకునేది లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో నింపిన బండ రాళ్లను పూర్తిగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



గుండ్లపోచంపల్లి ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఘట్‌కేసర్‌లో మిఠాయిలు పంచుతున్న ప్రవీణ్ రావు, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

మేడ్చల్‌రూరల్: వంట గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.200 తగ్గింపుపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ శ్రేణులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. రాఖీ పండగ సందర్భంగా వంట గ్యాస్ ధర తగ్గించి మహిళలకు శుభవార్త అందించారని తెలిపారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్ సరస్వతి, నాయకులు రవీందర్‌గౌడ్, కిషన్, మహేశ్, శ్రీధర్, విక్రమ్, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రాఖీ కానుకగా..

ఘట్‌కేసర్: మహిళలకు రాఖీ పండగ కానుకగా ప్రధాని మోదీ ఎల్పీజీ ధరలో రూ.200లు, ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు రూ.400లు తగ్గించారని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు బుధవారం ఉత్సవాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఎంపీటీసీ శోభారాణి, ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రఘు, సుభాషిణి, విక్రాంత్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడ, కండ్లకోయ, బాసిరేగడి పరిధిలోని సెయింట్ పీటర్స్, మల్లారెడ్డి, సీఎంఆర్, హితం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రాములు ఆధ్వర్యంలో ఓటు అవగాహన నిర్వహించారు. 18 ఏళ్లు నిండి ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వచ్చే నెల 3వ తేదీ వరకు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెప్మా కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, బీఎల్‌ఓలు శశిధర్‌రెడ్డి, సుజాత, సంతోష్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

శామీర్‌పేట్: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఏ డీసీ ఎం లత అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ, ఎస్‌పీఆర్ కళాశాలల్లో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సొంత నిధులతో 40 స్తంభాల ఏర్పాటు



పనులను పర్యవేక్షిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్ రమాదేవి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని రెండో వార్డు ప్రజల విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు స్థానిక కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి సొంత నిధులతో 40 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ విద్యుత్ పనులను బుధవారం పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ సొంత నిధులతో స్తంభాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, యాదగిరి, విమల, శివ, శశికళ, చంద్రమౌళి, శ్రీకాంత్, హరికృష్ణ పాల్గొన్నారు.

రహదారులను కబ్జా చేస్తే కఠిన చర్యలు



నాగారం రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో రహదారిని కబ్జా చేయడంతో జేసీబీతో కూల్చివేస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఎవరైనా కాలనీలకు వెళ్లే రహదారుల కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో రహదారిని కొందరు వ్యక్తులు కబ్జాచేసి ప్రహరీ గోడ నిర్మించారని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి కాలనీ రహదారిలో ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను మున్సిపల్‌కు చెందిన జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో రహదారుల కబ్జా, పార్కుస్థలాల కబ్జాలను సహించేది లేదన్నారు.

సమ్మె విరమించి విధుల్లో చేరండి

ఏఎన్‌ఎమ్‌లకు డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ వినతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఏఎన్‌ఎమ్‌లు సత్వరమే సమ్మెను ఉపసంహరించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ కోరారు. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం మెమోలు జారీ చేయడం, షోకాజ్ నోటీసు ఇవ్వడం, ఉద్యోగం నుంచి తొలగించడం వంటి క్రమశిక్షణ చర్యలను తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సమ్మె చేస్తున్న ఏఎన్‌ఎంలతో ఆయన చర్చించారు. ప్రభుత్వం ఏఎన్‌ఎంలకు మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తోందని తెలిపారు. వేతనాలు కూడా మిగతా రాష్ట్రాలను పోల్చుకుంటే బాగానే ఉన్నాయన్నారు. సమ్మె విరమించుకుని విధుల్లో పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఏఎన్‌ఎమ్‌ల సానుకూలమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో పలువురు వైద్యాధికారులు, ఏఎన్‌ఎమ్ ప్రతినిధులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: డబిల్‌పూర్ గ్రామ పరిధిలో మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలైన మరో వ్యక్తి నరేశ్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డబిల్‌పూర్ గ్రామ పరిధిలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో నగరంలోని చింతల్‌కు చెందిన రాకేశ్ అక్కడికక్కడ మృతి చెందగా మరో నలుగురు గాయాలపాలైన విషయం విదితమే. చికిత్స పొందుతున్న నరేశ్ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నరేశ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా నుంచి నూతన్‌కల్ గ్రామానికి వలస వచ్చి స్థానికంగా ఓ సీడ్ కంపెనీలో కార్మికుడి పనిచేస్తున్నాడు. చికిత్స పొందుతున్న మరో ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

కీసరదాయరను ప్రత్యేక గ్రామపంచాయతీగా గుర్తించాలి



మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కీసరదాయర గ్రామస్తులు

కీసర: కీసర గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామంగా ఉన్న కీసరదాయర గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా గుర్తించాలన్న డిమాండ్‌తో బుధవారం గ్రామస్తులు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సంతకాల సేకరణ చేపట్టిన పత్రాలను మంత్రి చామకూర మల్లారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రికి విన్నవించారు. తమ గ్రామంలో 800 ఓటర్లు ఉన్నారని, ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని పదేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. 14వ వార్డు సభ్యురాలు గుండు వనజాబాబుయాదవ్ తమ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి, రాజీనామాను ఆమోదించాలని కీసర పంచాయతీ కార్యదర్శితో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు అందజేశారు.

అందరూ కలిసిమెలిసి జీవించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శైలజ

మేడ్చల్: సమాజంలో వెనుకబడిపోయిన దళిత, గిరిజనులను చైతన్య పరిచేందుకే ప్రభుత్వం పౌర హక్కుల దినోత్సవాలను నిర్వహిస్తోందని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, తహసీల్దార్ శైలజ అన్నారు. మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అందరూ కులవివక్షను వీడి కలిసిమెలసి జీవించాలని అన్నారు. దళిత, గిరిజనులు ఉన్నత చదవులు చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కులవిక్షత చూపిస్తే చట్టం కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ శైలజవిజయానందరెడ్డి, సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, లంబాడాల హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ధన్‌రాజ్‌నాయక్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు, బర్సిగూడ గ్రామస్తులు

కీసర: బర్సిగూడ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ప్రభుత్వం, రెవెన్యూశాఖ గుర్తించినందుకు బుధవారం బర్సిగూడ గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నేతలు సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భోగారం గ్రామ పంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ చెప్యాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గతంలో భోగారం అనుబంధ గ్రామంగా ఉన్న బర్సిగూడ గ్రామానికి గ్రామ నక్ష లేకపోవడంతో ఇప్పటి వరకు ఇక్కడి రైతులకు కొత్త పట్టాదారు పుస్తకాలు మంజూరు కాలేదని, దీంతో రైతులకు రైతుబంధు, రైతుబీమా అందలేదన్నారు. సమస్యను మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ప్రత్యేక దృష్టికి సారించి ఏళ్ల నుంచి ఉన్న సమస్యను పరిష్కరించి బర్సిగూడ గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ప్రకటించడంతో ఇక్కడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గన్నేర్ల సత్యనారాయణ, నేతలు ప్రభాకర్‌రెడ్డి, నత్తి భూపాల్, పరశురాం, నర్సింగ్‌రావు, చంద్రకళ, నరేష్, నత్తి ప్రదీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా



ఘట్‌కేసర్‌లో వెంకటేశ్‌కు కండువా కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి



దివ్యాంగులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉన్నానని, అందుకే సొంత డబ్బుతో అభివృద్ధి చేస్తున్నానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని బైసమ్మగుట్ట ఆలయం వద్ద వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి సురేశ్ ఆధ్వర్యంలో వందలాది వడ్డెరులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, జిల్లా సభ్యుడు మంకయ్య, లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమార్‌ముదిరాజ్, రవి, లక్ష్మణ్, బీఆర్‌ఎస్ మున్సిపల్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల ఏర్పాటుకు మంత్రి సాయం

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు జర్మనీ టెక్నాలజీ కృత్రిమ కాళ్లు ఏర్పాటు చేసేందుకు మంత్రి మల్లారెడ్డి ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన ఎస్.జంగయ్యకు రూ.1.25 లక్షలు, పి.దుర్గయ్యకు రూ.1.25 లక్షల చెక్కులను అందజేశారు. మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, నాయకులు రాజ్‌గోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సంతోష్ భాను తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.4 లక్షల విరాళం



ఆలయ పనులను ప్రారంభిస్తున్న భద్రారెడ్డి, చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 16వ వార్డులోని ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్, మల్లారెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.4 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.లక్ష బుధవారం అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించారు. కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, నరేశ్‌యాదవ్, రవీందర్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య యాదవ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఆలయ చైర్మన్ బలరాం పాల్గొన్నారు.

కెరీర్ ప్లానింగ్‌పై దృష్టి సారించాలి

శామీర్‌పేట్: కెరీర్ ప్లానింగ్‌పై దృష్టి సారించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ రాజ్యలక్ష్మి, కల్నల్ ఏకే పాఠక్ అన్నారు. ఏ జర్నీ ఫ్రమ్ టూ సమోసా టూ స్టార్స్ అనే అంశంపై మోటివేషన్ సెషన్‌ను బుధవారం శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు కెరీర్ ప్లానింగ్‌పై దృష్టి సారించాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విషయంలోనూ కాంపిటేషన్ ఉందన్నారు. విద్యను అభ్యసిస్తూనే అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఇండియన్ ఆర్మీలోని కెరీర్ అవకాశాల అర్హతలు, వాణిజ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ స్రవంతి, డిపార్ట్‌మెంట్ హెచ్‌పీ అనుపమ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.